క్లుప్తంగా

నేడు వైఎస్సార్ ఆసరా సంబరాలు

పామిడి: పట్టణంలోని జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి హాజరవుతారన్నారు.

నెలగొండ గ్రామంలో రేపు..

గుంతకల్లు రూరల్: మండలంలోని నెలగొండ గ్రామంలో ఈనెల 12వ తేదీన వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జాషువా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తారన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు

యాడికి: ప్రయాణికుల సౌకర్యార్థం మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి దేవాలయం ఎదురుగా సోమవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రయాణికులు, వ్యాపారుల దాహార్తి తీర్చేలా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్, వార్డు సభ్యులు రామచంద్ర, బాలపెద్దయ్య, దాసరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై టార్పాలిన్ పట్టలు

శింగనమల: జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న టార్పాలిన్ పట్టలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తరిమెల సర్పంచ్ ఓబిలేసు అన్నారు. సోమవారం మండలంలోని తరిమెల, కల్లుమడి గ్రామాలకు చెందిన 59 మంది రైతులకు సబ్సిడీపై టార్పాలిన్ పట్టలు అంజేశారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ చిన్నమ్మ, వ్యవసాయ సిబ్బంది ఆదినారాయణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో రాళ్ల అపహరణపై విచారణ



టి.కొత్తపల్లిలో వివరాలు సేకరిస్తున్న ఆర్ఐ సందీప్

గుత్తి రూరల్: మండలంలోని టి.కొత్తపల్లి జగనన్న కాలనీలోని రాళ్లను గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు అపహరించి వారి పొలంలో నాటుకున్నారన్న విషయంపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. సోమవారం ఆర్ఐ సందీప్, వీఆర్ఓ నాగరాజు గ్రామానికి వెళ్లి పొలంలో నాటిన నంబర్ రాళ్లను పరిశీలించారు. టీడీపీ నాయకులు రమణ, చంద్రశేఖర్‌ను విచారించారు. పొలం హద్దులలో నాటిన రాళ్లు ఎక్కడివని ఆరా తీశారు. పలువురు గ్రామస్తులను అడిగి వివరాలు సేకరించారు. జగనన్న కాలనీలోని రాళ్లుగా తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని రైతులకు హెచ్చరించారు. జగనన్న కాలనీలోని రాళ్లు కాదని.. కొత్తపేట గ్రామంలో తమ బంధువులు ప్లాట్లు వేయగా మిగిలిన రాళ్లను తెచ్చుకొని తమ పొలంలో నాటుకున్నామని టీడీపీ నాయకులు రమణ, చంద్రశేఖర్ సమాధానం ఇచ్చారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు అధికారులు తెలిపారు.

మూడు చక్రాల వాహనం అందజేత



వాహనాన్ని అందజేస్తున్న ఎంపీ రంగయ్య

శింగనమల: మండలంలోని తరిమెల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు తరిమెల గోకుల్‌రెడ్డి రూ.85 వేలతో సమకూర్చిన మూడు చక్రాల వాహనాన్ని సోమవారం అనంతపురంలో ఎంపీ తలారి రంగయ్య చేతుల మీదుగా దివ్యాంగుడు అక్బర్ వలికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ తరిమెల రామకృష్ణ, మధు, మాజీ సర్పంచ్ ఆదినారాయణ పాల్గొన్నారు.

చిన్నారులకు దుస్తుల పంపిణీ

గుంతకల్లుటౌన్: జాతీయ మాతృత్వ అవగాహన దినోత్సవం సందర్భంగా ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. సోమవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్, డాక్టర్ సుజాతల చేతుల మీదుగా సమారు 100 మంది చిన్నారులకు దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు త్రిస్లాబన్సాలీ, దాత దినేష్ బన్సాలీ, క్లబ్ సభ్యులు విజయ, జయంతి, రేణుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ లబ్ధి

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి





తాడిపత్రి: 14వ వార్డులో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి. **బుక్కరాయసముద్రం:** ప్రభుత్వ పనితీరుపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

తాడిపత్రి: ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని 14వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డులోని ఇంటింటికీ తిరుగుతూ పథకాలపై అవగాహన కల్పించారు. అందుకు సంబంధించిన బుక్‌లెట్లను కుటుంబాలకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఏ సంక్షేమ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. అయితే జగనన్న వలంటీర్, సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజల ఇళ్ల వద్దకే పథకాలు అందిస్తున్నారని తెలిపారు. అవినీతికి తావులేకుండా పారదర్శకంగా పాలన అందిస్తున్నారని కొనియాడారు. సీఎం జగన్ పేదల పక్షపాతిగా నిలిచారన్నారు. ఈ ప్రభుత్వంలో కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. ప్రతి బిడ్డ ఉన్నత చదువులు అభ్యసించాలని విద్యకు ముఖ్యమంత్రి పెద్దపీట వేస్తున్నారన్నారు. నవరత్నాల్లోని పథకాలతో పేదలను ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. పేదలు ఆర్థికంగా ఎదిగేందుకు సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రిని మరోమారు అందరూ ఆశీర్వదించాలని కోరారు. వార్డులో ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు రంగనాథరెడ్డి, నాగిరెడ్డి, వార్డు ఇన్‌చార్జి నాయకులు హరినాథరెడ్డి, నాయకులు మల్లికార్జున, ప్రసాద్, బాలిరెడ్డి, గడ్డం పరమేష్, మహిళా నాయకురాలు మహేశ్వరి పాల్గొన్నారు.

యాడికి: అర్హతే ప్రామాణికంగా ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలను పారదర్శకంగా అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. చందన పంచాయతీలో సోమవారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే.. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సీఎం సందేశంతో కూడిన బుక్‌లెట్‌లను అందజేశారు. వ్యవసాయ బోరుబావులకు డీపీ ఏర్పాటు చేయించాలని పలువురు రైతులు కోరారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని వీఆర్ఓ రమేష్‌ను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వంలో టీడీపీ మద్దతుదారులకే సంక్షేమ పథకాలు అందాయన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థతో ఇంటి వద్దకే అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ చెన్నప్ప, యాడికి, లక్షుంపల్లె, తూట్రాళ్లపల్లె సర్పంచులు అనూరాధ, పద్మనాభరెడ్డి, సంజీవరాయుడు, ఎంపీటీసీలు పార్వతి, నాగరాజు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, ఉప సర్పంచ్ కాసా చంద్రమోహన్, గ్రామ నాయకులు ఆదిరంగారెడ్డి, వెంకటరామిరెడ్డి, శివకేశవరెడ్డి, డీసీ ఎంఎస్ కమిటీ సభ్యుడు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మొద్దు

బుక్కరాయసముద్రం: చంద్రబాబు చెప్పే మోసపూరిత మాటలను నమ్మొద్దని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రజలకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని విరూపాక్షేశ్వర నగర్, కొట్టాలపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో డ్రైనేజీ సమస్యలు, విద్యుత్ సమస్యలను కాలనీవాసులు విన్నవించారు. వెంటనే అధికారులతో మాట్లాడి, సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేశారని విమర్శించారు. 9 ఏళ్ల కాలంలో ప్రజలు చెప్పుకునే ఒక్క సంక్షేమ పథకం కూడా లేవన్నారు. అయితే సీఎం వైఎస్ జగన్ అన్న చేపట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఇది ఓర్వలేని టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ప్రజల హృదయాల్లో జగనన్నపై ఉన్న అభిమానం చెరిగిపోదని పేర్కొన్నారు. జగనన్న పాదయాత్ర చేస్తున్న సమయంలో ప్రజల కష్టసుఖాలు తెలుసుకుని వాటికి అనుగుణంగా మేనిఫెస్టోను తయారు చేశారన్నారు. ప్రజల దీవెనలతో అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని తెలిపారు. కాలనీల్లో ఏవైనా కారణాల వల్ల సంక్షేమ పథకాలు అందకుంటే దరఖాస్తు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అర్హులకు పథకాలు అందించాలని సచివాలయ సిబ్బంది, మండల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, సీనియర్ నాయకులు ఆలూరి రమణారెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి, నియోజకవర్గ యువ నాయకుడు ఆలూరి ఎర్రిస్వామి రెడ్డి, మండల కన్వీనర్ అంకే నరేష్, తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎంపీడీఓ తేజోత్స్న, వైస్ ఎంపీపీ రామగోపాల్, ఎంపీటీసీలు కాలువ వెంకటలక్ష్మి, సుజాత, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, పూల నారాయణస్వామి, బుల్లే నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, బలపనూరు అశోక్‌కుమార్, బుల్లే రాజా, రామచంద్రారెడ్డి, కొండమ్మ, ముత్యాల శీనపురుషోత్తం, రాజారెడ్డి, కేశవరెడ్డి, చంద్రమోహన్, శేషానందరెడ్డి, సాకే లక్ష్మీనారాయణ, చెదుల్ల శ్రీనివాసరెడ్డి, పూల రంగా, సూర్య నారాయణ, పుల్లయ్య, సాయినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

14 వరకూ చేనేత, హస్తకళల ప్రదర్శన

తాడిపత్రి టౌన్: స్థానిక సీబీ రోడ్డు మున్సిపల్ షాదీఖానాలో ఈనెల 14వ తేదీ వరకూ చేనేత, హస్తకళల ప్రదర్శన, అమ్మకాలు జరగనున్నట్లు విజయవాడ శ్రీకళాజ్యోతి హ్యాండిక్రాఫ్ట్ వెల్ఫేర్ సొసైటీ ఆర్గనైజర్ వెంకటయ్య సోమవారం తెలిపారు.

ప్రార్థన మందిరం నిర్వహణ విషయంలో ఇరువర్గాల ఘర్షణ

తాడిపత్రి అర్బన్: ప్రార్థన మందిరం నిర్వహణ బాధ్యతల విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆదివారం ఈస్టర్ వేడుకల సందర్భంగా నందలపాడులోని ప్రార్థన మందిరం బాధ్యతలను టీడీపీ కౌన్సిలర్ విజయ్‌కుమార్, గణేష్ వర్గానికి చెందిన వారు నిర్వహిస్తూ వస్తున్నారు. గత మూడు సంవత్సరాలుగా వీరు ప్రార్థన మందిరం ట్రస్టు సభ్యులుగా ఉంటున్నారు. అయితే వీరి ట్రస్టు సభ్యుల పదవీ కాలం పూర్తవడంతో నూతన ట్రస్టు సభ్యులను ఎన్నుకునేందుకు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మరో వర్గానికి చెందిన సునిల్, సూరీ వర్గీయులు ఇన్నేళ్లుగా ట్రస్టుకు సంబంధించిన జమ, ఖర్చుల వివరాలు చెప్పాలని పట్టుబట్టారు. అయితే ఇందుకు ఒప్పుకోని ప్రస్తుత ట్రస్టు సభ్యులు ఇప్పుడు కూడా తామే ట్రస్టు సభ్యులుగా కొనసాగుతామన్నారు. వేరే వారికి అవకాశం ఇవ్వమని తెగేసి చెప్పడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇరు వర్గాలు ఆదివారం రాత్రి పట్టణ పోలీసులకు పరస్పరం ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరువర్గాల వారిపై కేసులు నమోదు చేశారు.

19 నుంచి ఊబిచెర్లలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

గుత్తి రూరల్: ఊబిచెర్ల గ్రామంలో ఈనెల 19 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు లక్ష్మీరెడ్డి, లక్కిరెడ్డి శేఖర్, హసన్ బాషా సోమవారం తెలిపారు. కాశీ విశ్వనాథ్, శివుడి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీలో విజేతలకు మొదటి బహుమతిగా రూ.30,116, ద్వితీయ బహుమతిగా రూ.20,116 ఇస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8919663064 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



గార్లదిన్నె: పథకాలపై అభిప్రాయాలు తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గుంతకల్లుటౌన్: కరపత్రాలు అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్

గుంతకల్లుటౌన్: నవరత్నాల్లోని సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి చల్లని దీవెనలు అందించాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్ కోరారు. సోమవారం పట్టణంలోని 23వ వార్డులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె ఇంటింటికీ తిరుగుతూ జగనన్న పాలనలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజల అంగీకారం మేరకు ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయాల పట్టణ కన్వీనర్లు జింకల రామాంజినేయులు, ఖలీల్, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, గృహసారథులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం చేపట్టారు. పార్టీ మండల కన్వీనర్ నరేంద్ర, ఎంపీపీ వెంకటనారాయణ వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు.

యల్లనూరు: మండలంలోని చింతకాయమంద, గొడ్డుమర్రి, వెన్నపూసపల్లి, కల్లూరు, బొప్పేపల్లి, బుక్కాపురం, దంతలపల్లి తదితర గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జోరుగా సాగుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్‌కు మాకు అన్ని విధాలా సాయం చేశారని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గృహసారథులు గణేష్, గౌరీ, వరలక్ష్మి, రాములమ్మ, వలంటీర్లు గురుచంద్ర, రవిప్రసాద్, రమేష్, సురేష్, ప్రశాంతి, నాగార్జున, అపర్ణ పాల్గొన్నారు.

గుత్తి రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని సచివాలయాల మండల కన్వీనర్ సుభాష్‌రెడ్డి, సర్పంచ్ సుశీలమ్మ, ఎంపీటీసీ శంకరమ్మ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బసినేపల్లి, బసినేపల్లి తండా, రజాపురంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నాయకుడు లాలూనాయక్, రజాపురం కన్వీనర్ మదనకామరాజు, కేశవనాయుడు, ప్రతాప్, శివ పాల్గొన్నారు.

పామిడి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని మండల సచివాలయాల పట్టణ, రూరల్ కన్వీనర్లు బీ అసిఫ్, ఎం.కుమార్‌రెడ్డి అన్నారు. పామిడితో పాటు రూరల్ గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.

యాడికి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జనరంజక పాలనకు జనం జేజేలు పలుకుతున్నారని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, నగరూరు సర్పంచు రుక్మాంద రెడ్డి అన్నారు. నగరూరు, భోగాలకట్ట గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లు అతికించారు. సచివాలయ కన్వీనర్ కంబగిరి రెడ్డి, డీలర్ భాస్కర్ రెడ్డి, గృహసారథులు చలమారెడ్డి, వెంకటరాముడు, రామమోహన్ రెడ్డి, పాల్గొన్నారు.


నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని సచివాలయం-2 పరిధిలో గుజ్జల సరళాదేవి నగర్‌లో మంగళవారం ఉదయం 6:30 గంటలకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ నరేష్ తెలిపారు.

యాడికి: మండలంలోని చందన పంచాయతీలోని ఎస్సీ కాలనీలో మంగళవారం సాయంత్రం 3 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి తెలిపారు.

తాడిపత్రి టౌన్: పట్టణంలోని చేనేత కాలనీలో మంగళవారం ఉదయం 7:30 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు



గాయపడిన బాలచంద్ర, శ్రావణి, వీఆర్ఓ పెద్దన్న

గుంతకల్లు రూరల్: గుంతకల్లు-గుత్తి జాతీయ రహదారిపై గుంతకల్లు మండలంలోని పాతకొత్త చెరువు వద్ద సోమవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో గుంతకల్లుకు చెందిన బాలచంద్ర, అతడి కోడలు శ్రావణికి గాయాలయ్యాయి. వివరాలు.. గుంతకల్లు పట్టణంలోని దోనిముక్కల ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న బాలచంద్ర తన అక్క కూతురు అయిన శ్రావణితో కలిసి సోమవారం ఉదయం ఆటోలో ఉల్లిగడ్డలను విక్రయించేందుకు గుత్తికి వెళ్లాడు. వ్యాపారం ముగించుకుని తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో పాతకొత్తచెరువు వద్ద వారి ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయపడిన బాలచంద్ర, శ్రావణిని 108 వాహనంలో గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి..

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం బైక్ అదుపు తప్పిన ఘటనలో మహమ్మద్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పోదొడ్డి గ్రామానికి చెందిన మహమ్మద్ అనే యువకుడు పని నిమిత్తం పెద్దవడుగూరుకు ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. అయితే గుత్తి శివారులోని బైపాస్‌లో కొత్తపేట వద్ద వేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే వైద్యుల సూచన మేరకు అతడిని మెరుగైన చికిత్సలకు అనంతపురం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

పుట్లూరు: మండలంలోని ఏ.కొండాపురం గ్రామ సమీపంలో తాడిపత్రి-అనంతపురం ప్రధాన రోడ్డుపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కడవకల్లు వీఆర్ఓ పెద్దన్న తీవ్రంగా గాయపడ్డారు. తాడిపత్రి నుంచి ద్విచక్ర వాహనంలో కడవకల్లు సచివాలయానికి వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన వీఆర్ఓ పెద్దన్నను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు తీసుకెళ్లారు.

లివర్ అడిగినందుకు కత్తితో దాడి

యాడికి: చికెన్ కొన్న వ్యక్తి లివర్ కూడా కావాలని అడిగినందుకు చికెన్ షాపు నిర్వాహకుడు కత్తితో దాడి చేశాడు. వివరాలు.. పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడుకు చెందిన రంగస్వామి గత ఆదివారం సాయంత్రం యాడికి మండలం రాయలచెరువు గ్రామంలో బాబా చికెన్ సెంటర్ వద్ద చికెన్ తీసుకున్నాడు. లివర్ కూడా ఇవ్వాలని చికెన్ షాపు యజమాని బాబాను అడిగాడు. షాపు యజమాని లివర్ లేదు అన్నందుకు ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. షాపు యజమాని బాబా కొడుకు రంగస్వామిపై కత్తిని విసరడంతో చెవికి గాయమైంది. సోమవారం సాయంత్రం చికెన్ షాపు యజమానిపై రంగస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి తెలిపారు.

'ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లోకేష్‌కు లేదు'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ నారాయణ

శింగనమల: టీడీపీ చేపట్టిన యువగళం పాదయాత్రలో రైతుల సమస్యలపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విమర్శించే అర్హత నారా లోకేష్‌కు లేదని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ నారాయణ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నేరుగా పంటలను ఈ-క్రాప్ బుకింగ్ చేయడం, అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోతే, ఆ ఏడాదే పరిహారం అందించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కరువుతో పంటలు ఎండిపోతే కనీసం నష్టపరిహారం, పంటల ఇన్సూరెన్స్ ఇవ్వలేక పోయారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వంలో పంటలకు, తాగడానికీ నీరు లేదన్నారు. రైతులు, ప్రజలు ఎన్నో కష్టాలు పడ్డారన్నారు. జగనన్న ప్రభుత్వంలో విస్తారంగా కురిసిన వర్షాలతో కుంటలు, వాగులు, చెరువులు మరువ పారాయన్నారు.

15లోపు 'మిషన్ వాత్సల్య'కు దరఖాస్తు చేసుకోండి

తాడిపత్రి టౌన్: తల్లిదండ్రులను కోల్పోయిన, నిరాధరణకు గురైన, నిరాశ్రయులైన 18 ఏళ్లలోపు అనాథ పిల్లలు ఈనెల 15లోపు 'మిషన్ వాత్సల్య'కు దరఖాస్తు చేసుకోవాలని తాడిపత్రి సీడీపీఓ షాజిదా బేగం ఒక ప్రకటనలో తెలిపారు.

రంజాన్ సంతోషంగా జరుపుకోండి



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, తదితరులు



పెనకచెర్ల డ్యాం నుంచి పామిడి ఉత్తర కాలువకు నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుత్తి: రంజాన్ పండుగను ముస్లిములందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆకాంక్షించారు. పట్టణంలోని 21వ వార్డులో సోమవారం రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియా బేగం ఆధ్వర్యంలో సుమారు 1,000 మందికి రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియా బేగం, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ మాట్లాడుతూ.. రంజాన్ పండుగను పురస్కరించుకుని ప్రతి సంవత్సరం రంజాన్ తోఫాను ముస్లిములకు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోనా మురళీధర్ రెడ్డి, పట్టణ కన్వీనర్ పీరా, సచివాలయ కన్వీనర్ రంగస్వామి, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, జిల్లా నాయకులు గుణశేఖర్ రెడ్డి, రాజ్‌కుమార్ రెడ్డి, మర్తాడు అన్సార్, బంగారు షఫీ, మైనార్టీ పట్టణ అధ్యక్షులు ఫయాజ్, రియాజ్, మున్సిపల్ కౌన్సిలర్లు వాల్మీకి శివ, నజీర్, వరదరాజులు, కేవీ రమణ, నాయకులు ఖురేషి అన్వర్, చెన్నాజీ, సునీల్, రమేష్‌రెడ్డి, షఫి పాల్గొన్నారు.

సాగునీరు అందించడమే ధ్యేయం

పామిడి: పామిడి, గుత్తి మున్సిపాలిటీ పరిధిలో తాగు, సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి అన్నారు. సోమవారం పెనకచెర్ల డ్యాం నుంచి పామిడి, పెద్దవడుగూరు మండలాల 10, 11, 12, 13, 14 నంబర్ ఉత్తర కాలువకు వంద క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎస్ఈఓతో మాట్లాడి ఈ నెలాఖరు వరకూ నీటిని విడుదల చేయించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. పెనకచెర్ల డ్యాంలో రూ.175 కోట్లతో శాశ్వత తాగునీటి ఎద్దడి నివారణకు చేపడుతున్న పనులను పరిశీలించారు. హెచ్ఎల్‌సీ డీఈ రాఘవేంద్ర, ఏఈ సురేంద్ర, పబ్లిక్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ డీఈ గుర్రప్ప యాదవ్, ఏఈ రేవంత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్‌రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మధుసూధన్‌రెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

రాజకీయ అజ్ఞాని లోకేష్



మాట్లాడుతున్న మాజీ మున్సిపల్ చైర్మన్ రామలింగప్ప

గుంతకల్లుటౌన్: కనీసం వార్డు సభ్యుడిగా గెలవలేని రాజకీయ అజ్ఞాని నారా లోకేష్‌ను సీపీఐ నేతలు కీర్తించడం చూస్తే టీడీపీకి సీపీఐ అనుబంధ సంస్థగా మారిందన్న విషయం తేటతెల్లమైందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్.రామలింగప్ప అన్నారు. సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. లోకేష్ పాదయాత్ర ద్వారా ఎంపీ, ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాలు వెలుగు చూస్తున్నాయని, పాదయాత్రకు విశేష స్పందన లభిస్తోందని సీపీఐ రాష్ట్ర నాయకుడు జగదీష్ వ్యాఖ్యానించడం సిగ్గుచేటని విమర్శించారు. యువగళం పేరుతో పప్పునాయుడు నిర్వహిస్తున్న పాదయాత్ర అబాసుపాలైందన్నారు. పాదయాత్ర సభల్లో స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలపై వ్యక్తిగత దూషణలకు దిగుతూ, వారిపై నిరాధారణమైన ఆరోపణలు చేయడం సరికాదన్నారు. లోకేష్ రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తూ ప్రశాంతంగా ఉన్న జిల్లాలో కక్షలు, కార్పణ్యాలకు ప్రేరిపిస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో ఇసుక దోపిడీ, మద్యం, బెల్ట్‌షాపుల ద్వారా పచ్చపార్టీ నేతలు కోట్లకు కోట్లు సంపాదించారన్నారు. అయితే ఆ రోజు సీపీఐ నేతలు ఎందుకు ఉద్యమాలు చేయలేదని ప్రశ్నించారు. జగన్ హఠావో-ఏపీ బచావో అని సీపీఐ నేతలు వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. సమావేశంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు సుంకప్ప, మోహన్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ భీమలింగప్ప, కౌన్సిలర్ భాస్కర్, సీనియర్ నాయకులు నూర్‌నిజామి, ఖలీల్, వెంకటేష్, మస్తాన్ పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల వల్లే పరిశ్రమలు మూతపడ్డాయి

గుంతకల్లులో స్లీపర్, కెమికల్, సోప్ తదితర ఫ్యాక్టరీలు మూతపడటానికి స్థానిక సీపీఐ నాయకులే కారణమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల రామాంజినేయులు ఆరోపించారు. సీపీఐ నాయకుల వల్లే వందలాది కార్మికుల కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

గుంతకల్లుటౌన్: గుంతకల్లులోని వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పేదలకు మెరుగైన వైద్య సేవలందించడంతో పాటు కిడ్నీ రోగుల కోసం డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికై సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఆస్పత్రిలో ఓటీ సేవలను వెంటనే పునరుద్ధరించాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌కు అందజేశారు. అలాగే పట్టణంలో మౌలిక వసతులు కల్పించాలని కమిషనర్ బండి శేషన్నకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసులు, నాయకులు డి.శ్రీనివాసులు, మారుతి, దాసరిశ్రీనివాసులు, సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, రమేష్, నాయకులు రమేష్, రంగమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: మండలంలోని మొలకలపెంటలో వైద్య శిబిరం నిర్వహించి, వైద్య పరీక్షలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మొలకలపెంటలో పర్యటించారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వారిని పరామర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కార్యదర్శి కసాపురం రమేష్ పాల్గొన్నారు.